"ఉద్యోగం వచ్చేవరకూ వస్తే పెళ్ళి చేసుకోను."

"ఉద్యోగం రాకపోతే?"

"పెళ్ళే మానేస్తాను."

"అయితే, ఈ లోపున పక్కింటమ్మాయిల్ని. . ."

"ఛీ. . .నే నంత నీచుణ్ణి కాదు."

"కష్టమే?"

"కాదు. . . ఇష్టమే!"

• • •

"పెళ్ళంటూ జరగాలంటే నా కుద్యోగం వచ్చి తీరాలి."

"ఉద్యోగం ఇప్పించే మామగార్ని వెతుక్కోవచ్చుగా!"

"హాఁ పతివలా న్నాశించి నా పెళ్ళి జరగదు."

"తెలీ కడుగుతాను: ఉద్యోగానికీ — పెళ్ళికీ సంబంధం ఏమిటి?"

"పెళ్ళాం కనీసావసరాలు తీర్చలేని బ్రతుకు దుర్భరం! పెళ్ళయ్యాక అలా విడిపోయిన ఎన్ని జీవితాల్ని చూడలేదు? అయినా, నా బతుకు నేనే సరిగ్గా ఈడవలేక పోతున్నాను. అందు కోమా ఆర్థికంగా అవసరాలు తీరని శరీరం—కోరికకు స్థిరపడదేమో నని నా అభిప్రాయం."

"అంటే?"

## కిన్నెర

"ఏముంది? శారీరక సంతృప్తి పూర్తిగా పొందలేని వాడు మానసికంగా అనుభూతి పొందలేడు. పొందడానికి సిద్ధపడడేమో కూడా."

"మరయితే ఫుట్‌పాత్‌లమీద ముష్టి వాళ్ళ ప్రణయాలగురించి ఏమంటావ్?"

"వాళ్ళ దౌర్భాగ్యం అంటాను. వాళ్ళు పూర్తిగా మానసిక సంతృప్తిని పొందుతారంటే నే నొప్పుకోను."

"కావచ్చు. . .కాని, ప్రకృతి ప్రసాదించిన ఒక్కగా నొక్క అద్భుతమైన వరం పట్ల నీ కింత అనాసక్తత ఉండటం అసహజం."

"అరే! నాకు అనాసక్తత ఉందనడం లేదే. . . పెళ్ళి పట్ల నాకు ఎంతటి గౌరవభావ ముందో తెలుసుకుంటే ను వ్వలా అనడానికి సాహసం చేసి ఉండవు. వచ్చిన వచ్చిన భార్యతో జీవితం ఎంతో రమ్యమైనది. . . కొబ్బరిచెట్ల ఆకుల సందుల్లోంచి చంద్రుడు చిట్లుతూ చిమ్మే వెన్నెల్లో ఆమెతో గడపటం, మల్లె పందిరి నీడ మల్లెల సౌరభాలతో మత్తెక్కించే పడక మీద భార్య ఒడిలో కబుర్లు చెబుతూ, కమ్మని కలలు కంటూ నిద్రపోవటం, బంగారుభవిష్యత్తును మెరిపించ జేసే ముద్దు బిడ్డల కళ్ళలోకి అలా



చూస్తూ భార్యా భర్తలిద్దరూ జీవితాన్ని ఆనందంగా గడిపేయడం. . .ఇలా ఇంకా ఎన్నో... ఇంత పెద్ద ఆలోచన. . . పెళ్ళి పట్ల నా అవగాహన. . . అందుకే కనీసావసరాలు అయినా తీరే మంచి ఉద్యోగం వస్తేనే కాని పెళ్ళికి సిద్ధపడనంటున్నా.''

''వెల్, మై డియర్ బోయ్! పెళ్ళి పట్ల ఇంత కఠినమైన ప్రవర్తన ఉంటుందని నే నెన్నడూ అనుకోలేదు. నీ ఆశ నెరవేరే వరకూ నీలో ఎట్టి చంచలనం రాకూడదని కోరుకుంటున్నా.

అయితే, ఒక్కమాట! ఎప్పుడైనా పరే నీ వీ విషయంలో ఓడిపోవడం జరిగితే, జీవితంలో ఓ మెట్టు కిందికి జారిపోతే ఓడిపోయానని ఏడ్చి ఏడ్చి గుండెలు బద్దలు కొట్టుకోకుండా జీవితం మీద ఆశను చిగురింప చేసుకుంటావని ఆశిస్తున్నా. ఆ గుండె ధైర్యం సదా నీకుండాలని కోరుకుంటున్నా. ఉత్తరాలు మాత్రం రాయి'' అనేసి చకచకా కదిలి, కదులుతున్న ట్రెయి నెక్కాడు మెడిసిన్ ఫైనలియర్ చదువుతున్న శ్రీపతి.

'నే నంత పిరికివాణ్ణి కాదు, శ్రీపతీ!' వరవరారావు దృఢంగా అనుకున్నాడు.




ఇది ఆరు కాలెండర్ల క్రితం మాట!

ఈ మధ్య కాలంలో పరమారావు జీవితంలో చాలా మార్పులు సంభవించాయి.

ఉన్న ఒక్కగా నొక్క పెద్ద దిక్కైన తల్లి మరణించింది. తనతో మిగిలున్న ఇల్లు అమ్ముడై పోయింది.

చదువుకున్న చదువుకి దేశం సరైన విలువ కట్టక పోవడంతో ఊరు కాని ఊర్లో ఓ కాన్వెంట్ టీచర్‌గా బతుకుతున్నాడు.

అర్థ మాటపడవారు పార్లు ఇంటర్వ్యూకి వెళ్ళిన వాళ్ళకి తప్పని సరిగా ఉద్యోగం ఇచ్చి తీరాలని శాసనం ఉండి ఉంటే—అతనికి ఉద్యోగం వచ్చేదే! అటువంటి దేదీ లేకపోవడం వల్ల అత నాశించిన మంచి ఉద్యోగం, కనీసం పూర్తి ఆకలిని తీర్చేదికూడా రాలేదు.

అందుకే అతను పెళ్ళి చేసుకోలేదు. పిల్ల నిచ్చేవాళ్ళుకూడా లేరు అని చెప్పడమే కరెక్టు!

అతను బతుకు బాట వెతుక్కోవడం ప్రారంభించిన రోజుల్లో చేసుకున్న నిర్ణయాలని కఠినంగానే అమలు జరుపుతున్నా, అది మౌలికమైన దానికే పరిమితమై పోయిందని కమలమ్మని చూశాక అనుకున్నాడతను.

• • •

కమలమ్మ తన జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుం దనుకోలేదు ఎప్పుడూ అతను. అలా అనుకుని ఉంటే ఆమెను కోరుకునే వాడు కాదేమో!

కమలమ్మ అత నుండే ఇంట్లోనే అద్దెకి ఉంటోంది.

ఆమెను ఆ దృష్టితోనే చూశాడు కాని, ఇంకో దృష్టితో ఏనాడూ చూడ లేదు.

కాని—

ఆమె అతని జీవితంలోకి విచిత్రంగా ప్రవేశించింది.

ఆమెకు పెళ్ళయి నాలుగేళ్ళయింది. భర్త లారీ డ్రైవరు.

అందానికి నిర్వచనం కాకపోయినా, ఆమె అందగత్తె!

ఆమెను ఇంకో దృష్టితో చూసిన రోజు పరమారావు డైరీలో స్పష్టంగా టిక్ చేసి ఉంటుంది. అది అతని జీవితానికి తియ్యని అనుభూతికూడా.

ఆ వేళ. . .

ఎప్పుడూ ఉదయం ఎనిమిది గంటలకు కాని నిద్ర లేవని అతను, అయిదు గంటలకే లేచాడు. చీకటి అప్పుడే వెలుగు ధాటికి తట్టుకోలేక పరారీ అవడానికి ప్రయత్నిస్తూంది.

కిటికీలోంచి పెరట్లోకి చూసిన అతను, ఆ దృశ్యం చూసి నిశ్చేష్టుడై పోయాడు. నరాలు ఒక్కసారిగా స్పందించి పోయాయి.

వివేకం చర్నున కొరడాతో కొట్టి నట్లనిపించి గబుక్కున పక్కకి వచ్చేశాడు; తలుపు మూసేశాడు.

కాని, మస్తిష్కంలో మరువలేని, మరపురాని ముద్ర!

మనోనేత్రం ముందు సినిమా రీలులా అదే దృశ్యం!

బావి పక్కన తడక దగ్గిర వివస్త్ర అయి, పీట మీద కూర్చుని తలారా స్నానం చేస్తున్న కమలమ్మ! . . .

• • •

మనిషి తను పందెం వేసి బలవంతాన పొందరాడ దనుకున్నది మరీ మరీ దగ్గిరకు చేరువవుతూంటే—తప్పించుకోవడానికి దాన్ని దూరమైనా చేస్తాడు, లేక తానే దూరంగా ఉండటానికి ప్రయత్నిస్తాడు.

అదే చేశాడు అతను.

అక్కడనుండి మకాం మార్చేద్దా మనుకున్నాడు కాని, అతనికి అవకాశం కలిసి రాలేదు.

అందుకే వాంఛకి బీజం వేసిన కమలమ్మ ముందే తిరుగుతూ, నేల కేసి గట్టిగా కొట్టే కొద్దీ ఎగిరిపడే బంతి లాంటి కోరికని బలవంతాన అణుచుకున్నాడు.

అణుచుకున్నా అణగని కోరికలు కొన్ని ఉంటాయి. వాటితోనే యౌవనానికి కళ్ళెం వేయడం వస్తుంది. మనసు ఎదురు తిరక్కుండానే ఉండాలి కాని, అది ఎదురు తిరిగిందా చస్తే మాట వినదు!

ఆమెను అలా ఆ స్నానం చేస్తున్నప్పుడే చూడాలనిపించి, చివరకు ఒకానొక కాళరాత్రి, వర్షం రాత్రి, ఆమె భర్త డ్యూటీ కెళ్ళిన రాత్రి, కోరికలు ఎంత అణుచుకున్నా అణగని రాత్రి...

"కమలమ్మా!"

"ఛీ. . . అదేం పిలుపు!"

"సరే. కామూ అని పిలుస్తాను — సరేనా?" నవ్వింది.

"మనం తప్పు చేయటం లేదూ?"

"నా కలా అనిపించడం లేదు."

"అదేం?"

"కట్టుకున్న పెళ్ళాన్ని మరిచిపోయి బయటి వాళ్ళ కోసం అర్రులు జాచి, బయటే సుఖాల్ని కొనుక్కునే మగాడి కోసం ఏ భార్యా పవిత్రంగా ఉండాలని నే ననుకోను."

"అది నీ కెలా తెలుసు?"

"మనిషి మంచిని దాచి పెట్టొచ్చు కాని, చెడుని దాచి పెట్టడం కష్టం!"

"అయితే,మన విషయం అంతేగా?"

"నా కా భయం లేదు. నీకూ అక్కర లేదు. ఈ విషయం బయట పడినా, నే నతన్ని ఎదిరించి ఎలాగోలా బతగ్గలను. అంత భయపడేదాన్నయితే నీతో ఇలా ఉండేదాన్నే కాదు."

"నిజమే— నువ్వు నా కింత తేలిగ్గా లొంగుతా ననుకోలేదు."

'నే ననుకున్నాను'_ లోపలే అనుకుంది ఆమె.

• • •

ఒక విషయం తప్పా, ఒప్పా అనేది ఆలోచనా దృక్పథం మీద ఆధారపడి ఉంటుంది.

పరమారావుకి తను ఓడిపోయానని పించింది. కాని, మోహంతో ఒకరి జీవితాన్ని నాశనం చేయటం లేదన్న సంతృప్తి మిగిలిపోయింది. ఆ సంతృప్తి కూడా అతనికి తన జీవితం త్వరలో నరక మవబోతూందని తెలిస్తే ఉండేది కాదేమో?

'ఎంత ఆర్థిక దుస్థితిలో ఉన్నా, ప్రతి మనిషీ ఒకసారి కాకపోయినా ఏదో ఒకసారైనా కోర్కె తీర్చుకోవడానికి ప్రయత్నించక పోడు' అన్న సత్యాన్ని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాడు. అయితే, మానసికంగా సంతృప్తిని సంపూర్తిగా పొందలేకున్న నిర్ణయాన్ని మాత్రం మార్చుకో లేక పోయాడు.

• • •


"ఛీ. . . ఛీ. . . వెధవ బతుకు. . . ఈ ముఖాన్ని ఈ లోకానికి ఎలా చూపి స్తాలో?"

ఆ విషయం జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా అతను వణికి పోతున్నాడు. ప్రపంచమంటేనే అసహ్యం కలుగుతూంది.

ఇంత ఘోరమైన విషయం తన పట్ల జరుగుతుం దనుకుంటే అత డామెను కోరుకునే వాడు కాదేమో?

కాని, జరగవలసింది జరిగిపోయింది.

మనిషి ఊహించని ఘోరమైన పరిణామాలు ఎదుర్కొంటే ఎంతటి ధైర్యవంతుడైనా విలవిల్లాడి పోతాడు. గుండె చెరువై పోతుంది. ఏడుస్తాడు. జుట్టు పీక్కుంటాడు. తల బాదుకుంటాడు. ఇవన్నీ చేసినా,ఇంకేం చేయాలో అర్థం కాని పరమారావు, వీటన్నిటికీ కారణమైన కమలమ్మ మీద కసి తీర్చుకోవాలనుకున్నాడు. ముక్కలుముక్కలుగా నరికి కాకులకు గద్దలకు వేసి మరీ కసి తీర్చుకోవా లనుకున్నాడు.




అనేకం వివేకాన్ని విలువనా ఖూనీ చేస్తుంది.

"కమలమ్మా! నిజం చెప్పు—నేను కాక నీకు ఎంత మందితో సంబంధ ముంది?"

"అప్పట్లే... స్త్రీ మగాడికి తేలిగ్గా లొంగిపోతే అలానే ఉంటుంది."

"ఛీ. . .కులటా! నాకు నీతులు చెప్పకు. అడిగిన దానికి సమాధానం కావాలి." అని ఉగ్ర రూపం ఆమెను భయకంపితురాల్ని చేసింది.

"నా భర్త. . .అంతే!"

"అది తెలుసు. నాతో సంబంధ మున్న వాళ్ళు. . ."

"మ వొక్కడవే!"

"నే నమ్మను."

"నే చెప్పేది నిజం!" అంతకు మించి నే నేం చెయ్యలే నన్నట్లున్నాయి ఆమె చూపులు. అతను నవ్వాడు.

"మరయితే ఎలా జరిగింది? ఎక్కడో ఏదో లోపముంది. . ." గొణుక్కుంటూ మెల్లగా అక్కణ్ణించి కదిలిపోతున్న అతన్ని విచిత్రంగా చూసినా, అతను ఎందు కలా గొణుక్కుంటూ వెళ్ళిపోతున్నాడో అర్థమైనట్లుంది. వెంటనే పేలి చింది 'మాటంటూ', రెండు రోజుల క్రితమే డాక్టర్ని కలిసిన కమలమ్మ! కాని, అతను వివరించుకునే స్థితిలో లేడు.

రోడ్డుమీద ఏమి వస్తున్నాయో కూడా తెలీకుండా, గమ్యం తెలిసి—లేని పిచ్చివాడిలా సాగిపోతున్న అతనిలో ఎన్నో ఆలోచనలు జీవం పోసుకుంటున్నాయి.

'ఎలా జరిగింది. . . ఎలా జరిగింది . . . ఎంత తప్పు చేశాడు తను. . . . జరిగింది జరిగిపోయింది. తనకు అన్యాయం జరిగిపోయింది. అప్పుడు ఆమె మాటల్ని పట్టించుకోలేదు... పట్టించుకుంటే తను ఇలా ఈ రోజున ఏడుస్తూ మధన పడేవాడు కాదు. . . అవును సరిగ్గా అంతే! . . అప్పుడే ఆంది కమలమ్మ—"కట్టుకున్న పెళ్ళాన్ని మరిచి పోయి బయటి వాళ్ళ కోసం అర్రులు జాస్తూ, బయటి సుఖాల్ని కొనుక్కునే మగాడి కోసం ఏ భార్యా పవిత్రంగా. ." అంతే. . . అంతే. . . పది మందితో తిరిగే వ్యక్తి, బజారు ఆడవాళ్ళతో అలవాటు పడిపోయిన వ్యక్తి భార్యతో తను కోర్కె తీర్చుకున్నది. . . అది అంటురోగం. . . తప్పదు. . . తప్పదు. అది అంటురోగం. . . అయ్యో. . . అయ్యో. . . అన్యాయం. . . తిరుగులేని అన్యాయం జరిగిపోయింది. . . నిజంగా ఈ అన్యాయం తిరుగులేనిదేనా. . . ఏమో?. . . తన దగ్గిర డబ్బుకూడా లేదు. . . ఎలా?... ఇప్పు డెలా?. . . డబ్బు ఇచ్చేవాడుకూడా లేడు. . . లేడు. . . ఒక్కడూ లేడు. . . తన జీవితం అంతా వృథా. . . పట్టి వృథా ... ఎందుకు వెధవ చదువు—తిండికూడా పెట్టలేనిదీ, ఏదైనా వస్తే బాగుచేయించు కోలేనిదీ. . . ఏదైనా వస్తే ఎలా వస్తుందో తెలుసుకో లేనిదీ. . . బతుకు పట్ల, సెక్సు పట్ల ఒక విధమైన భావాన్ని, అభిప్రాయాన్ని కలిగించనిదీ . . . ఎందుకూ?. . .'

లారీ బ్రేకులు కీచుమన్నాయి. ఎవరో అతన్ని పక్కకి లాగేశారు. "కళ్ళు మూసుకు నడుస్తారు. . . చస్తే ఏమయ్యేది? లారీ డ్రైవరును ఇరకాటంలో పెట్టడం తప్పితే. . ." మట్టూ జనం!

అందరూ వింతగా చూస్తున్నట్లు, అదోలా అందరి చూపులు తన మీదే . . . ఎక్కడో. . . ఏమిటో శరీరం అంతా వికృతంగా ముడుచుకు పోతున్నట్లు . . . లేదు, ఏమీ కాలేదు. . . కానీ. . . కానీ. . .

పరిస్థితులు మనసుని పిరికితనంతో తడిపేస్తాయి.

గబగబా అక్కణ్ణించి కదిలిపోయాడు. అత నో నిశ్చయానికి వచ్చాడు.

'ఈ జబ్బుతో తను ఈ ముఖాన్ని ఈ లోకానికి చూపలేడు. అందుకే శాశ్వతంగా వీళ్ళందరికి దూరం అయి పోవాలి ... అయినా, ఇదెంత ఘోరం! పెళ్ళి కాకుండానే. . . కేవలం ఒకే ఒక స్త్రీతో ఉన్న సంబంధానికే తన కీ... ఛీ. . . ఛీ. . . వెధవ బతుకు. . . అందుకే అంటారేమో? అర గడియ భోగం, ఆరు నెలల రోగం. . . ఈ మాక్సి డబ్బున్న వాళ్ళకే చెల్లుతుందేమో? కాని, తన లాంటి వాళ్ళకు కాదు. . . అందుకే తను బతకలేడు. . . చావాలి. . . చచ్చిపోవాలి. . .'

గవర్నమెంటు హాస్పిటల్లో కనిపించిన జనాన్ని చూసే సరికి ఆలోచనలను ఉరి తీయవలసి వచ్చింది. అంతకు ముందెన్నడూ అంత మందిని చూడ లేదు. అందుకే ఆశ్చర్యం వెలిబుచ్చుతూ అడిగాడు ఎవర్నో—

"మీకు తెలీదా? ఎవరో కొత్తాయన. మంచి బాగా చూస్తున్నాడు లెండి. అందరికి ఇంజక్షన్లు చేయడం, బిళ్ళలు ఇవ్వడం, మనూరికి ఇటువంటి డాక్టరెప్పుడూ రాలేదు. బహుశా. . ." ఇంకా అత నేదో చెబుతున్నాడు.

అకస్మాత్తుగా అతనికి డాక్టరు మిత్రుడు శ్రీపతి చెప్పిన మాటలు జ్ఞప్తికి వచ్చాయి—

"ఎప్పుడైనా ఓ దెబ్బ తింటే జారిపోతే ఓడిపోయానని ఏడ్చి ఏడ్చి గుండెలు బద్దలు కొట్టుకోకుండా జీవితం మీద ఆశను చిగురింప జేసు కుంటావని ఆశిస్తా."

'ఇప్పు డెక్కడున్నాడో? ఓ సారి ఉత్తరం వచ్చినా, జవాబు రాయలేదు.

నిజంగానే తనిప్పుడు గుండె నిబ్బరాన్ని కోల్పోతున్నాడు కనకే చని పోవాలను కుంటున్నాడు. కాని. . . పట్టినే తను భయపడుతున్నాడేమో?. . . ఏమో? . . . ఈ రోగం అంత భయంకర మైనదా? తెలీదు. . . ఏదీ తెలీదు. . . పోనీ, ఈ డాక్టర్ని అడిగి తెలుసుకుంటే? అతను మంచివాడట కూడాను . . . ఈ ఒక్క తనికే తను చేసిన తప్పు గురించి తెలియచెప్పుకుంటే. . . బహుశా ఉచితం గానే మందు లిస్తాడు. . . తగ్గిపోతుంది కూడా. . .'

మళ్ళీ ఆశలు చిగురిస్తున్నాయి. రంగుల ప్రపంచం మీద ఇంతలోనే కోరిక. . .

నిలుచున్న క్యూ నెమ్మదిగా కదులు తూంది.

'కాగితం మీద పేరూ, తనెందుకు వచ్చిందీ. . .' కాంపౌండరు తీసుకు వెళ్ళాడు.

క్యూ చివర మొదటివాడైన అతను ఒక్క క్షణంకూడా అక్కడ ఉండలేక పోయాడు.

ఆకాశం అంచు విరిగి మీద పడు తున్నట్లు భయపడ్డాడు. వేగం! ఒకటే వేగం. . . ఎక్కడికో. . .

ఆత్రంగా బయటికి వచ్చిన డాక్టర్ శ్రీపతి—కనిపించని పరమారావు కోసం చూశాడు. అక్కడి వాళ్ళను అడిగాడు. "మీరు పిలుస్తుండగానే, మీ గొంతు వినపడగానే అతను ఎందుకనో కంగారు పడుతూ వెళ్ళిపోయాడు" అన్న జవాబు తప్ప ఇంకే ఆశా మిగల్లేదు. అయినా, లోపల ఎక్కడో మిణుగురులా మెరుస్తున్న ఆశ, కాంపౌండర్ని వెంట వెతకమని ఆజ్ఞాపించింది.

కాని—

వెళ్ళిన మనిషి వెళ్ళినట్లే వచ్చాడు. కనిపించని ఆ మనిషి కోసం ఆయన పడే ఎందుకు ఆరాట పడుతున్నాడో అర్థం కాలేదు అతనికి.

అదే అడిగాడు—

"సార్! ఎవ రతను?"

"సవాలు చేసిన మనిషి ముందే ఓడిపోయానని ఒప్పుకోలేని మనుష్యుల్లో అతను ఒకడు. అతను జీవితంలో ఓడి పోయిన మనిషి." శ్రీపతి పెదాలు విడి వడ్డాయి.

అతని హృదయాంతరాళం మాత్రం—'కాదు. అతను ఓడిపోలేదు. ఈ పరిస్థితే అతన్ని పరిపూర్ణమైన మానవుడుగా తయారు చేయటంలో ఓడిపోయింది' అని గొణగటం అతను వినలేకపోయాడు.

